# పెద్ద మనసులు



మాధుర్య...

మాధుర్యేనా...?

నా కళ్లను నేనే నమ్మలేకపోయాను.

అడుగులో అడుగు వేస్తూ మెల్లగా గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మాధుర్యను చూస్తూ ఆశ్చర్యపోవడం నా వంతైంది. డిగ్రీ చదివే రోజుల్లో... చిలుకూరు వెళ్లి... బాలాజీ గుడిలో 'ప్రదక్షిణలు చేద్దాం రావే' అంటే సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లేనిదే దేవుడు మాత్రం ఏం చేయగలడు?' అని తేలికగా కొట్టి పారేసిన మాధుర్య ఈనాడు ప్రదక్షిణలు ఎందుకు చేస్తోంది?

నాకేం అర్థం కాలేదు. ఆలోచించి బుర్ర వేడెక్కింది.

'మధూ...' – ఎదురెళ్లి పిలిచాను.

మాధుర్య కళ్లల్లో మెరుపు.

కాసేపు ఆగమని సైగ చేసింది.

మా పిల్లలిద్దర్నీ పనిమనిషితో ఇంటికి పంపించాను. చెట్టు క్రింద కూర్చున్నాను.

అసలు మాధుర్యకేమైంది? కళ్లక్రింద నల్లని చారలు. కేన్సర్ పేషెంట్‌లా తయారయింది. మాధుర్య పేరుకు తగ్గట్లే పాటలు మధురం – మాటలు మధురం – నిర్ణయాలు మధురం. డిగ్రీలో కాలేజ్ ఫస్ట్ వచ్చిన మాధుర్య – హఠాత్తుగా పెళ్లి చేసుకుంది.

'అదేమిటి? – పిజి చేయవచ్చు కదా – ఈ పెళ్లి ఏమిటి?' అంటే 'నాన్న ఇష్టమే నా ఇష్టం. మంచి కోడలుగా – మంచి ఇల్లాలుగా ఉండడంలో నాకెంతో ఆనందం ఉంది. మా వారు ఇంజనీరు. బోలెడు ఆస్తి. స్వంత ఇల్లు. ఆడపడుచుల్లేరు. అత్తమామల సేవాభాగ్యం నా అదృష్టం' అంటూ మురిసిపోయింది. అన్నట్లుగానే మాధుర్య అత్తమామల్ని ఎంతో బాగా చూసుకొనేది. అత్తగారు వెంట లేనిదే ఎక్కడికీ వెళ్లేది కాదు. గుళ్లు – గోపురాలు – పార్కులు – సినిమాలు... అందరూ కలిసే వెళ్లేవారు. అందరూ మాధుర్య ఎంతో అదృష్టవంతురాలు అనేవారు.

ఓసారి ఊటీకి వెళ్తున్నట్లు ఫోన్ చేసింది.

'ఆదర్శమహిళా – అత్తగార్ని కూడా తీసుకెళ్తున్నావా? ఉత్తమ కోడలిగా గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాలని ఆశా?' అని అడిగాను.

'ఆవిడ చలికి తట్టుకోలేరు లేకపోతే..." అంటూ నవ్వేసింది.

'సత్యా – సత్యా' మాధుర్య పిలుపుతో నా ఆలోచనలకి అంతరాయం.

'మధూ – ఇన్నాళ్లూ ఎక్కడున్నావు? ఈ ఊరు ఎప్పుడువచ్చారు? చాలా సన్నబడ్డావ్! ఏమైంది నీకు? ప్రశ్నల వర్షం.

'ఇంటికి వెడుతూ మాట్లాడుకుందాం రా' కారువైపు నడకసాగించింది మాధుర్య. అనుసరించాన్నేను.

'బెంగుళూరు నుంచి అహ్మదాబాద్ ఇస్రోకి మావారికి ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడే ఆరేళ్లు ఉండిపోయాం. ఆయనకి ఇక్కడ ఒక పెద్ద కంపెనీలో ఆఫర్ వచ్చింది. ఇక్కడికి వచ్చి ఏడాది అవుతోంది. నీ ఫోన్ నెంబరు లేక నిన్ను కలవలేకపోయాను' అంది మాధుర్య.

కారు పెద్ద బంగ్లా ముందు ఆగింది.

'మీ అత్తగారు – మామగారూ ఎలా ఉన్నారు?' అడిగాను.

'మామగారు పోయారు. అత్తగారు ఏదో అలాగే ఉన్నారు'.

**నీలిమ**

'పిల్లలు?' ఆగిపోయాను.

'లేరు' మాధుర్య మొహం వాడిపోయింది.

తలుపు తీసుకొని లోపలికెళ్లాం. మాధుర్య వాళ్లత్తగారు మెల్లగా నడుచుకుంటూ వచ్చి కుశల ప్రశ్నలడిగారు. సమాధానాలు చెబుతున్నాను. కానీ ఏదో అలజడి. ఆవిడలో కూడా ఏదో మార్పు.

మాధుర్య లోపలికెళ్లి జ్యూస్ తీసుకొచ్చింది.

'మీ అత్తగారికి కూడా ఇవ్వు' అన్నాను.

'నాకూ ఆవిడకీ ఇక ఏం పని? తినడం – త్రాగడం' అంది విసురుగా. ఉలిక్కిపడ్డాను. నేను వింటున్నది నిజమేనా? అంటున్నది మాధుర్యేనా?

'మీ అమ్మా నాన్నల గురించి చెప్పలేదు' అన్నాను.

'అమ్మ, నాన్నా ఇద్దరూ పోయారు. అన్నయ్య అమెరికాలో సెటిల్ అయ్యాడు. వాడు ఇక్కడికి రాడు. నన్నే రమ్మంటాడు. ఈవిడని వదిలిపెట్టి వెళ్లటం కుదరదు. ఆయనకి ఆఫీసే లోకం. ఎక్కడికి వెళ్లాలన్నా ఈవిడ కారులో కాసేపైనా కూర్చోలేదు. దిగి రెండడుగులు కూడా నడవలేదు. రామేశ్వరం వెళ్లినా శనేశ్వరం తప్పదన్నట్లు ఈవిడతో వెళ్లి అవస్థలు పడలేక వెళ్లడమే మానేసాం'. మాధుర్య మాటలు మధురంగా విన్పించడం లేదు – ఎందుకని?

ఇంతలో కాలింగ్ బెల్ మ్రోగింది. మాధుర్య అటుగా వెళ్లింది.

'మాధుర్య ఎందుకిలా అయింది?' వాళ్లత్తగార్ని అడిగాను.

'పిల్లలు లేరని దిగులు. మంగళ – శని వారాలు కఠిన ఉపవాసం. మిగతా రోజులు ఒక్కపూట భోజనం. తను అలా కృశించిపోతూ ఉంటే చూడడానికే దేవుడు నన్నింకా ఉంచాడు' ఆవిడ కళ్లల్లో నీళ్లు.

మాధుర్య లోపలిరాగానే 'తరువాత కలుస్తాను' అని చెప్పి వచ్చేసాను.

ఇంటికి వచ్చినా మాధుర్య ఆలోచనలు వదలడం లేదు. మాధుర్య వాళ్లాయన సతీష్‌ని కలవాలన్పించింది.

* * *

'సతీష్...' మాధుర్య గురించి చెప్పండి. నాకు తెలిసిన మాధుర్య ఇంతిలా ఎలా మారిపోయింది?'

'పిల్లలు లేరనే బాధలో మాధుర్య ఏం చేస్తోందో తనకే తెలియడం లేదు. తిరగని హాస్పిటల్, మొక్కని దేవుడు లేడు. ప్రాబ్లమ్ తనలోనే ఉందన్నారు. ఆ నిస్సహాయత, ఒంటరితనం మాధుర్యకి అమ్మ మీద ద్వేషాన్ని పెంచుతున్నాయి. ఒక్కోసారి తను తప్పు చేస్తున్నానని ఏడ్చేస్తూ ఉంటుంది' అన్నాడు సతీష్.

'నాకు అర్థమైంది సతీష్! – మాధుర్యని డాక్టర్ వసుమతిగారి దగ్గరికి తీసుకెళ్తాను' అన్నాను.

* * *

నేను, మాధుర్య వసుమతిగారి హాస్పిటల్లో ఉన్నాం. వసుమతిగారు ఇంకో అరగంటలో వస్తారట.

'మధూ – నీవేం అనుకోకపోతే ఓ మాట చెప్పనా?'.

నీవు చాలా తప్పు చేస్తున్నావు. నీవు దేవతలా చూసుకొనే నీ అత్తగార్ని ఎందుకు నీ మాటలతో బాధిస్తున్నావ్? వృద్ధాప్యంలో ఉన్న ఆ పసిమనసు నీకు కన్పించటం లేదా?' అడిగాను బాధగా.

మాధుర్య ఒక్కసారిగా భోరున ఏడ్చేసింది.

ఆ బేలతనం మాధుర్యలో ఎప్పుడూ చూడలేదు.

'మధూ – ఊరుకో... నీ సమస్యకి పరిష్కారం చూపాలనే ఇక్కడికి తీసుకువచ్చాను. నిన్నే డాక్టరుగారికి నీ గురించి అంతా చెప్పాను. ఏడవకు' అంటూ ఓదార్చాను.

ఇంతలో వసుమతిగారు వచ్చారు. లోపలికెళ్లి పరిచయాలయ్యాక ఆవిడ 'నాతో రండి' అంటూ లేచారు.

హాస్పిటల్లో ఓ ప్రక్కగా ఉన్న ఇంకో బిల్డింగ్ వైపు తీసుకెళ్లారు.

లోపల లేత రోజా పువ్వులా ఉన్న పసి పిల్లలు.

ఉయ్యాల్లో కొందరు – ఆయమ్మలు ఆడిస్తూంటే గంతులు వేస్తున్న ఆ ముద్దు మురిపాల పిల్లల్ని చూస్తున్న మాధుర్య ముఖంలో సంతోషం.

వసుమతిగారు మెల్లగా చెబుతున్నారు.

'నాకు పిల్లలు లేరు. ఇప్పటి పరిజ్ఞానంతో సంతానవంతులు కావడం ఏమాత్రం కష్టం కాదు. హోటల్ రూముని అద్దెకి తీసుకున్నట్లు గర్భాశయాలు అద్దెకు తీసుకుని మరీ పిల్లల్ని పుట్టిస్తున్నారు. అమ్మ, నాన్న అవసరం లేకుండానే పిల్లలు పుట్టే రోజులూ వచ్చాయి. మనం పిల్లల్ని కంటే ఒక్కరికో – ఇద్దరికో మాత్రమే మన ప్రేమని అందిస్తాం. ఈ ప్రపంచంలో కోట్ల మంది అనాథపిల్లలు అమ్మానాన్నల ఆలనా పాలనా లేక అనాథశరణాలయాల్లో, ఫుట్‌పాత్‌ల మీద అలమటిస్తున్నారు. ఇక్కడున్న పిల్లలందర్నీ చేరదీసాను. ఇప్పుడు చూడు... నాకెంత మంది పిల్లలో. "అమ్మా" అని ఒక్కరు కాదు – అందరూ పిలుస్తూంటారు. ఇంతకంటే ఏం కావాలి?'

మాధుర్య మంత్రముగ్ధురాలై వింటోంది.

'మా అత్తగారు, మామగారు, మావారు అందరూ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించిన వాళ్లే' అంటూ గార్డెన్‌లోకి తీసుకెళ్లారు.

దూరంగా డాక్టరుగారి అత్తమామలు పిల్లల ఆటపాటలతో మురిసిపోతున్నారు. ఆ దంపతుల్ని చూస్తూ అలాగే ఉండిపోయింది మాధుర్య.

* * *

ఉదయం 10 గంటలకి మాధుర్య దగ్గర్నుంచి అర్జంట్‌గా వసుమతిగారి హాస్పిటల్‌కి రమ్మని ఫోన్. త్వరగా పనులు ముగించుకొని అర గంటలో అక్కడున్నాను. మాధుర్య నవ్వుతూ ఎదురొచ్చింది. మాధుర్య ముఖంలో కొత్త వెలుగు. లోపలికి వెళ్లాం.

సతీష్ చేతిలో ఓ పాప, వీల్‌ఛైర్‌లో ఓ బాబు, ప్రక్కనే వసుమతిగారు.

'ఏం చేయబోతున్నావు మాధుర్యా?' ఆశ్చర్యంగా అడిగాను. మాధుర్య ఇద్దరు పిల్లల్ని పెంచుకోవాలనుకుంటోంది' – అన్నారు వసుమతిగారు.

'ఇద్దరా? మరి ఈ బాబుకి కాళ్లు...'

అవును సత్యా! బాబు నడవలేడు. నాకు ఈ బాబే కావాలి. వాడికి అన్నీ నేనై ఆ లోపం తెలియకుండా పెంచుతాను' మాధుర్య గొంతులో తెలియని ఆవేశం – ఆనందం.

సతీష్, మాధుర్య, నేనూ పిల్లలతో కలిసి బయటికి వస్తున్నాం.

'అన్నయ్యా – నీకు తెలుసా? నేను ఓ పాప, బాబు, మా అత్తగారితో కలిపి ఒక్కసారిగా ముగ్గురు పిల్లల తల్లినయ్యాను'.

ఫోన్‌లో వాళ్ల అన్నయ్యతో మాట్లాడుతున్న మాధుర్య కంఠం నాకు మధురంగా విన్పించింది.